క్లుప్తంగా

సీసీఆర్ కార్డుల పంపిణీ



సీసీఆర్ కార్డులను అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

ఇందుకూరుపేట : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో కౌలు రైతులకు సీసీఆర్ కార్డులను కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కౌలు రైతులు సీసీఆర్ కార్డులు పొందాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రమేష్, ఏడీ రాజ్‌కుమార్, ఏఓ రఘునాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అక్రమ లేఅవుట్లపై కమిటీ వేస్తాం



మాట్లాడుతున్న సోమిరెడ్డి

పొదలకూరు : పట్టణానికి సమీపంలో అక్రమంగా వేసిన లేఅవుట్లపై ఒక కమిటీని వేసి నివేదిక రూపొందిస్తామని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. పంచాయతీ, నుడా అనుమతులు లేకుండా తప్పుడు పత్రాలతో లేఅవుట్లు వేసిన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఇందుకు సంబంధించి ఆధారాలు కూడా సేకరించామన్నారు. ఆక్రమణలకు గురైన పొట్టేళ్ల వాగును పరిరక్షిస్తామన్నారు. నాయకులు బి.భాస్కర్‌రెడ్డి, వెంకటరత్నంనాయుడు, మల్లికార్జున్ నాయుడు, మస్తాన్‌బాబు, జమీర్ ఉన్నారు.

మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడండి



రావూరువారికండ్రిగ పాఠశాలలో మొక్క నాటుతున్న వాకర్స్ సభ్యులు

తోటపల్లిగూడూరు : మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని ఎంఈఓ వేణుగోపాల్‌రెడ్డి కోరారు. ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ వారి సహకారంతో రావూరువారికండ్రిగ ప్రాథమిక పాఠశాలలో మొక్కలు నాటే కార్యక్రమం గురువారం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో చెట్లు ఎంతో కీలకమన్నారు. విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే మొక్కల పెంపకంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ–2 జయరామనాయుడు, పాఠశాల హెచ్‌ఎం నారాయణ, ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు బలరామయ్యనాయుడు, రామ్మోహన్‌రెడ్డి, సుబ్బారాయుడు తదితరులు పాల్గొన్నారు.

నిడిగుంటపాళెంలో ఉచిత వైద్య శిబిరం



వెంకటాచలం : మండలంలోని నిడిగుంటపాళెం గ్రామంలో నారాయణ దంత వైద్యశాల సహకారంతో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు రోగులను పరీక్షించి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. టీడీపీ నాయకులు రాధాకృష్ణమనాయుడు, పద్మనాభచౌదరి, చైతన్యరెడ్డి, బీజేపీ మండలాధ్యక్షుడు కుంచి శ్రీనివాసులుయాదవ్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : మండలంలోని రామచంద్రారెడ్డి నగర్ వద్ద ముంబై జాతీయ రహదారిపై గురువారం తెల్లవారుజామున రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. స్థానికులు కథనం మేరకు.. నంద్యాల నుంచి నెల్లూరు బారాషహీద్ దర్గాకు వెళ్తున్న తుఫాన్ వాహనం ముందు వెళ్తున్న ఎండ్ల బండిని ఢీకొట్టింది. ప్రమాదంలో ఎడ్లబండిలో ఉన్న దువ్వూరు శ్రీనివాసులురెడ్డి, దువ్వూరు వెంకురెడ్డికి గాయాలయ్యాయి. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కారు ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలు

సంగం : కారు ఢీకొని వ్యక్తి తీవ్రంగా గాయపడిన ఘటన సంగంలోని ఎంజీఆర్ బ్యారేజీపై గురువారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు..పొదలకూరు మండలం సూరాయపాళేనికి చెందిన గోపాల్ పని నిమిత్తం సంగానికి వచ్చాడు. తిరిగి బ్యారేజీపై నడుచుకుంటూ వెళ్తుండగా సంగం నుంచి పొదలకూరు వైపు వెళ్లే కారు వెనుకగా ఢీకొంది. దీంతో గోపాల్ తలకు తీవ్ర గాయమైంది. క్షతగాత్రుడ్ని సంగం 108 వాహన సిబ్బంది నెల్లూరులోని వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సమస్యల వలయంలో వసతి గృహం

కోవూరు బీసీ బాలికల వసతి గృహం సమస్యల వలయంలో చిక్కుకుంది. ఇక్కడ విద్యార్థుల సంఖ్య పెరుగుతున్నా.. వారికి సరిపడా సౌకర్యాలు కల్పించడంలో అధికారులు, పాలకులు విఫలమయ్యారు. దీంతో కనీస మౌలిక వసతులు లేక ఇరుకు గదుల్లో బాలికలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని బాలికల తల్లిదండ్రులు విజ్ఞప్తి చేస్తున్నారు.

- కోవూరు బీసీ బాలికల హాస్టల్లో మౌలిక వసతులు మృగ్యం
- పట్టించుకోని పాలకులు, అధికారులు



అసంపూర్తిగా వదిలేసిన భవనం

కోవూరు : మండల కేంద్రమైన కోవూరులో 1973వ సంవత్సరంలో బీసీ బాలికల వసతి గృహాన్ని నిర్మించారు. అప్పట్లో రెండు గదులతో భవన నిర్మాణాన్ని పూర్తి చేశారు. అప్పటి నుంచి నిర్వహణ లేకపోవడంతో భవనం దుస్థితికి చేరుకుంది. కాగా పెరుగుతున్న విద్యార్థినులకు అనుగుణంగా 2016వ సంవత్సరంలో అప్పటి టీడీపీ ప్రభుత్వంలో రూ.10 లక్షలతో రెండు అదనపు గదుల నిర్మాణాన్ని ప్రారంభించారు. అయితే పనులను పూర్తి చేయకుండానే శ్లాబ్ దశలోనే అసంపూర్తిగా వదిలేశారు. దీంతో కొత్త గదులకు మోక్షం దక్కక, ఉన్న విద్యార్థినులకు అధికారులు వసతులు కల్పించలేకపోతున్నారు.

విద్యార్థినులకు తీవ్ర ఇబ్బందులు

కోవూరు బాలికల వసతి గృహంలో మూడో తరగతి నుంచి పదో తరగతి వరకు చదువుకుంటున్న విద్యార్థులు ఉంటారు. ఇక్కడ మొత్తం 140 మంది విద్యార్థులు ఉండాల్సి ఉండగా, ప్రస్తుతం 155 మంది విద్యార్థులు ఉంటున్నారు. కాగా ప్రస్తుతం రెండు గదులు మాత్రమే వినియోగంలో ఉండడంతో విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధిక సంఖ్యలో విద్యార్థినులు ఉండడంతో వారికి కావల్సిన వసతులు కల్పించడంలో అధికారులు విఫలమవుతున్నారు. మరీ ముఖ్యంగా రాత్రి వేళల్లో పడుకునే సమయాల్లో విద్యార్థినులు తీవ్ర అసౌకర్యానికి లోనవుతున్నారు. అంతే కాకుండా బాలికలు తమ వస్తువులను భద్రపరుచుకునే ట్రంకు పెట్టెలను ఎక్కడ ఉంచాలో తెలియని పరిస్థితి నెలకొంది. ఈ పెట్టెలను భద్రపరుచుకునేందుకు స్థల సమస్య వేధిస్తోంది. ఇక్కడ వార్డెన్‌గా పనిచేస్తున్న నాగభూషణమ్మ పదవీ విరమణ చేయగా, ఆమె స్థానంలో బుచ్చిరెడ్డిపాళెం బీసీ వసతి గృహ వార్డెన్ లక్ష్మిని డిప్యుటేషన్‌పై పంపారు. శాశ్వత వార్డెన్ లేకపోవడంతో ఇక్కడి సమస్యలను పట్టించుకునేవారు లేకుండాపోయారు. అంతే కాకుండా వసతి గృహ పరిసర ప్రాంతాలు సైతం అధ్వానంగా ఉన్నాయి. ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ తీసుకుని అసంపూర్తిగా ఉన్న గదులను పూర్తి చేయాలని కోరుతున్నారు.

అభివృద్ధి చేయాలి



కోవూరు బీసీ బాలికల వసతి గృహాన్ని అభివృద్ధి చేయాలి. విద్యార్థినులకు సరైన సౌకర్యాలు కల్పించాలి. అసంపూర్తిగా ఉన్న గదులను పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలి. దీనిపై అధికారులు దృష్టి సారిస్తే బాగుంటుంది.

– నగ్గళ్ల అవినాష్, కోవూరు



అసంపూర్తిగా ఉన్న అదనపు గది



స్థలం లేక ఒకేచోట ఉంచిన ట్రంకు పెట్టెలు

పశుపోషణతో ఆర్థికాభివృద్ధి



దూడలకు నట్టల నివారణ మందులు పంపిణీ చేస్తున్న డాక్టర్ శ్రీనివాసులునాయుడు

వెంకటాలం : పశుపోషణతో రైతులు ఆర్థికాభివృద్ధి చెందుతారని మండవ ఫౌండేషన్ వైద్యుడు డాక్టర్ శ్రీనివాసులునాయుడు పేర్కొన్నారు. మండలంలోని తిక్కవరప్పాడు పంచాయతీ గొట్లపాళెంలో మండవ ఫౌండేషన్, పశుసంవర్ధక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత పశు వైద్యశిబిరం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు గేదెలు, దూడలకు సాధారణ వ్యాధులకు సంబంధించి పరీక్షలు చేశారు. నట్టల నివారణ మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీనివాసులు నాయుడు మాట్లాడుతూ వ్యవసాయంతో పాటుగా, పశుపోషణపై దృష్టిసారించిన కుటుంబాలు ఆర్థికంగా మెరుగుపడుతాయని తెలియజేశారు. రైతులు పశువులకు వచ్చే వ్యాధులపై అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని చెప్పారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి డాక్టర్ వెంకటేశ్వర్లు, ఆరోగ్యమిత్ర శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అధైర్యపడొద్దు.. అండగా ఉంటా



పొదలకూరు : రామలింగారెడ్డిని పరామర్శిస్తున్న మాజీ మంత్రి కాకాణి



మనుబోలు : నారపరెడ్డిని పరామర్శిస్తున్న కాకాణి

- మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

పొదలకూరు : 'గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలెవరూ అధైర్య పడొద్దు.. ఎల్లవేళలా అండగా ఉంటా' అని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి భరోసా కల్పించారు. మండలంలోని డేగపూడి గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకుడు రామలింగారెడ్డి అనారోగ్యానికి గురి కాగా కాకాణి గురువారం ఆయన్ను పరామర్శించారు. ఈ సందర్భంగా రామలింగారెడ్డి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో టీడీపీ అరాచకాలు ఎక్కువగా ఉన్నాయని, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు అన్యాయం జరిగితే న్యాయపరంగా ఎదుర్కొంటామన్నారు. కాకాణి వెంట గ్రామ సర్పంచ్ ఓబుల్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు పులి వెంకటేశ్వరరెడ్డి, కేతు రామిరెడ్డి, నాయకులు పులి వెంకట్రామిరెడ్డి, విష్ణు, వై.పెంచలరెడ్డి, మాల్యాద్రి తదితరులు ఉన్నారు.

నారపరెడ్డికి కాకాణి పరామర్శ

మనుబోలు : మండలంలోని అక్కంపేట పంచాయతీ శ్రీరాంనగర్ కాలనీకి చెందిన దండు నారపరెడ్డిని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి గురువారం పరామర్శించారు. ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో నారపరెడ్డి గాయపడి విశ్రాంతి తీసుకుంటుండగా కాకాణి వెళ్లి ఆరోగ్య పరిస్థితిపై ఆరాతీశారు. అలాగే కాలు విరిగి విశ్రాంతి తీసుకుంటున్న దండ రావమ్మను పరామర్శించారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు చిట్టమూరు అజయ్‌కుమార్‌రెడ్డి, దాసరి భాస్కర్‌గౌడ్, కడివేటి చంద్రశేఖర్‌రెడ్డి, గుంజి రమేష్, చలగల దయాకర్, అంబటి శ్రీనివాసులురెడ్డి, పల్లంరెడ్డి శ్రీహరిరెడ్డి, దండు అమర్‌నాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కుష్టు బాధితులపై వివక్ష తగదు



ఇంటింటి సర్వేను పరిశీలిస్తున్న డాక్టర్ సురేంద్ర

పొదలకూరు : కుష్టు బాధితులపై వివక్ష తగదని, ఈ వ్యాధి లక్షణాలు ఉన్న వారి వివరాలను వెంటనే తెలియజేయాలని జిల్లా కుష్టు నివారణాధికారి డాక్టర్ సురేంద్ర అన్నారు. మండలంలోని లింగంపల్లి, మొగళ్లూరు సచివాలయాల పరిధిలో ఇంటింటి కుష్టు వ్యాధి గుర్తింపు సర్వేను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులకు నిర్వహించిన కుష్టువ్యాధి అవగాహన సదస్సులో పాల్గొని, మాట్లాడారు. కుష్టు వ్యాధిగ్రస్తులను సమాజంలో చిన్నచూపు చూడకుండా ఆదరించాల్సిందిగా పేర్కొన్నారు. బహుళ ఔషధాలను వినియోగించి వ్యాధిని పూర్తిగా నయం చేసే అవకాశం ఉందన్నారు. ప్రతి ప్రభుత్వ ఆస్పత్రిలో వ్యాధి నివారణ మందులు లభిస్తాయన్నారు. కార్యక్రమంలో డాక్టర్ కిరణ్‌రిషిత, డీపీఎంఓ మోహన్‌రావు, ఆరోగ్య విస్తరణాధికారి రవికుమార్, ఆరోగ్య పర్యవేక్షకులు మస్తాన్‌బీ, సహాయకులు వెంకటేశ్వర్లు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

బీసీజీ వ్యాక్సిన్‌పై అవగాహన పెంచాలి

- డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ బ్రిజిత



చింతచెలికలో బీసీజీ వ్యాక్సినేషన్ను పరిశీలిస్తున్న డాక్టర్ బ్రిజిత

కొడవలూరు : అడల్ట్ బీసీజీ వ్యాక్సిన్‌పై ప్రతిఒక్కరిలో అవగాహన పెంచాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ బ్రిజిత సూచించారు. యల్లాయపాళెం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మండలంలోని చింతచెలికలో జరిగిన బీసీజీ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ఆమె గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీసీజీ వ్యాక్సిన్ ప్రయోజనాలను తెలియజేయడంతో పాటు వ్యాక్సిన్ వేయించుకునేలా వైద్య సిబ్బంది ప్రోత్సహించాలన్నారు. ఈ వ్యాక్సిన్ వల్ల క్షయ వ్యాధి రాకుండా ఉండడంతో పాటు బీపీ, షుగర్‌లను నియంత్రించవచ్చని తెలిపారు. మధుమేహ బాధితులు, ధూమపానం అలవాటు ఉన్న వారు, క్షయ రోగితో దగ్గరి సంబంధం ఉన్న వారు విధిగా వ్యాక్సిన్ వేయించుకోవాలన్నారు. అనంతరం ఆమె లెప్రసీ(కుష్టు) సర్వేను పరిశీలించారు. ప్రతి ఇంటినీ సర్వే చేయడంతో పాటు సకాలంలో పూర్తి చేయాలని వైద్య సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారిని కావ్య, పీహెచ్ఎన్ విజయ, హెచ్ఈఓ కోటేష్, ఎంఎల్‌హెచ్‌పీ సౌమ్య, ఏఎన్ఎం అనిత పాల్గొన్నారు.

అర్హులందరికీ సాగు హక్కు పత్రాలు

పొదలకూరు : అర్హత కలిగిన ప్రతి కౌలురైతుకు పంటసాగు హక్కు పత్రాలను అందజేస్తామని ఏఓ ఎ.వాసు పేర్కొన్నారు. మండలంలోని కనుపర్తి, ఆర్‌వై పాళెం గ్రామాల్లో సీసీఆర్ కార్డులపై అవగాహన సదస్సును గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ 36 రెవెన్యూ గ్రామాల్లో పంటసాగు హక్కు పత్రాలను రైతులకు అందజేస్తామన్నారు. మండలంలో 1,364 పంటసాగు హక్కు పత్రాలను అందజేయడం లక్ష్యంగా నిర్ణయించినట్లు చెప్పారు. సీసీఆర్ కార్డుల ద్వారా పట్టాదారునికి ఎలాంటి నష్టం వాటిల్లదని తెలిపారు. కార్డులు కలిగిన వారు సబ్సిడీ విత్తనాలు, బ్యాంకు రుణాలు, పంట నష్టపరిహారం పొందే అవకాశం ఉంటుందన్నారు. ప్రతిఒక్కరూ సీసీఆర్ కార్డులపై అవగాహన పెంచుకుని కౌలు రైతులకు కార్డులను అందజేసేందుకు సహకరించాల్సిందిగా సూచించారు. ఈ కార్డులు కావల్సిన రైతులు దరఖాస్తు చేసుకోవాల్సిందిగా సూచించారు.

కౌలు రైతులకు ప్రయోజనం

కొడవలూరు : కౌలు రైతులు సీసీఆర్(పంట సాగుదారు హక్కు) పత్రం పొందడం వల్ల ఎంతో ప్రయోజనకరమని ఏఓ లక్ష్మి సూచించారు. మండలంలోని నాయుడుపాళెం, గండవరంలలో కౌలు రైతులకు మంజూరైన సీసీఆర్ కార్డులను గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని కౌలు రైతులకు సీసీఆర్ కార్డుల ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. పంట నష్టపోతే పరిహారం పొందాలన్నా కౌలు రైతులు విధిగా సీసీఆర్ కార్డులు కలిగి ఉండాలన్నారు. వ్యవసాయశాఖ నుంచి వచ్చే ఏ రాయితీలు పొందాలన్నా, బ్యాంక్ రుణాలు పొందాలన్నా సీసీఆర్ కార్డు ఆవశ్యమన్నారు. కార్యక్రమంలో వీఆర్వోలు జి.దుర్గాప్రసాద్, కె.విజయభారతి, వీఏఏలు కె.శ్రావ్య, టి.కవిత, స్థానిక నేత మాగుంట సతీష్‌రెడ్డి పాల్గొన్నారు.

సీసీఆర్ కార్డులతో ప్రభుత్వ ఫలాలు

తోటపల్లిగూడూరు : సీసీఆర్ కార్డులతో ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందుతున్నట్లు మండల ఏఓ శిరీషారాణి అన్నారు. మండలంలోని సౌత్‌ఆములూరు, విలుకానుపల్లి, వెంకన్నపాళెం రైతు భరోసా కేంద్రాల్లో సీసీఆర్ కార్డులపై గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ మండలంలో 1,091 మంది కౌలు రైతులకు సీసీఆర్ కార్డులను అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు కావేరి, అనూష, ఝాన్సీ పాల్గొన్నారు.

గురుపూర్ణిమకు మందిరాల ముస్తాబు



వరకవిపూడిరోడ్డు సెంటర్‌లోని బాబా మందిరం

ముత్తుకూరు : గురుపూర్ణిమ పండగకు మండలంలోని సాయిబాబా మందిరాలు ముస్తాబవుతున్నాయి. ఈనెల 20వ తేదీన గురుపూర్ణిమ కావడంతో మందిరాలను సర్వాంగ సుందరంగా అలంకరిస్తున్నారు. ముఖ్యంగా ముత్తుకూరు, వల్లూరు, బ్రహ్మదేవి, వరకవిపూడిరోడ్డు కూడలి, తాళ్లపూడి, కృష్ణపట్నం తదితర గ్రామాల్లో వెలసిన మందిరాల్లో ప్రత్యేక కార్యక్రమాలు, విశేష పూజలు జరిపేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. లక్ష్మీనరసాపురంలోని కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజల నిర్వహణకు తగిన ఏర్పాటు చేశారు.

గండవరంలో రొట్టెల పండగ నేడు



రొట్టెల పండగకు ముస్తాబైన గండవరంలోని సాతో షహీద్ దర్గా



దర్గాలోని ఏడు సమాధులకు ఏర్పాటు చేసిన రక్షణ కవచం

- సాతో షహీద్ దర్గాలో ఏర్పాట్లు పూర్తి

కొడవలూరు : మండలంలోని గండవరంలో ఉన్న సాతో షహీద్ దర్గాలో శుక్రవారం జరిగే రొట్టెల పండగకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. దర్గా ప్రాంగణంలో ఉన్న కోనేరులో దర్గా కమిటీ సభ్యులు నీరు నింపి రొట్టెలు వదిలేందుకు అనుకూలంగా మార్చారు. దర్గాలో ఉన్న ఏడు మత ప్రవక్తల సమాధులకు దాత సహకారంతో స్టీల్ రక్షణ కవచం ఏర్పాటు చేశారు. అతిథుల విడిది కోసం నిర్మించిన రెండు గదులను సిద్ధం చేశారు. రొట్టెల పండగ సందర్భంగా వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.

400 ఏళ్ల క్రితం

మొహర్రం నెల 13వ రోజున సాతో షహీద్ దర్గాలో రొట్టెల పండగ నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ దర్గా ఆవిర్భవానికి ఎంతో చరిత్ర ఉందని ముస్లిం పెద్దలు చెబుతున్నారు. సుమారు 400 సంవత్సరాల క్రితం మత ప్రచారం కోసం 12 మంది ముస్లిం మత ప్రవక్తలు ఈ ప్రాంతానికి వచ్చారు. ఇక్కడ జరిగిన పవిత్ర యుద్ధంలో ఏడుగురు ప్రవక్తల తలలు ఈ ప్రాంతంలో పడ్డాయని చెబుతుంటారు. 12 మంది ప్రవక్తల మొండెములు మాత్రం నెల్లూరులోని స్వర్ణాల చెరువు వద్ద పడ్డాయని అందువల్లే అక్కడ పన్నెండు సమాధులతో బారాషహీద్ దర్గా ఆవిర్భవించగా, ఏడు తలలు పడిన చోట సాతో షహీద్ దర్గా నిర్మాణం జరిగిందనే నానుడి ఉంది. ఇక్కడి దర్గాలోని ఏడు సమాధులు కూడా మత ప్రవక్తల తలలకు చిహ్నాలేనన్నది ముస్లిం భక్తుల విశ్వాసం. వీరిని మొహర్రం నెల పదో రోజున హతమార్చినందున ఆ రోజున బారాషహీద్ దర్గాలో రొట్టెల పండగ జరుగుతుందని, ఆ రోజుకు మూడో రోజైన జియారత్(చిన్న కర్మ) రోజున సాతో షహీద్ దర్గాలో రొట్టెల పండగ నిర్వహించడం ఆనవాయితీ. బారా షహీద్ దర్గాకు వచ్చిన భక్తులు చాలా మంది ఇక్కడకూ వచ్చి రొట్టెలు పట్టుకొంటారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల వారితో పాటు కర్ణాటక, కేరళ, తమిళనాడు రాష్ట్రాల నుంచి కూడా ఇక్కడకు భక్తులు వచ్చి రొట్టెలు పట్టుకొంటారు. నెల్లూరు నుంచి ఇక్కడకు కేవలం 15 కిలోమీటర్ల దూరమే ఉండడంతో బస్సులో వచ్చే వారు కావలి వైపు వెళ్లే బస్సులో ఎక్కి జాతీయ రహదారిపై గండవరం క్రాస్ రోడ్డు వద్ద దిగి ఆటోల్లో ఇక్కడకు చేరుకోవచ్చు.



రొట్టెలు వదిలేందుకు సిద్ధం చేసిన కోనేరు

దాతల సహకారంతో అభివృద్ధి చేస్తాం



ఎంతో ప్రాధాన్యత ఉన్న సాతో షహీద్ దర్గా దాతల సహకారంతో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నాం. కేంద్రంలో మంత్రిగా ఉన్న జాఫర్ షరీఫ్ అప్పట్లో రూ.10 లక్షల నిధులు మంజూరు చేశారు. ఆ నిధులతో దర్గాను కొంత అభివృద్ధి చేయడంతో పాటు రొట్టెల వదిలే కోనేరు, అతిథుల గదులు, రెండు మరుగుదొడ్లు నిర్మించడం జరిగింది. ఈ రొట్టెల పండగను పురస్కరించుకుని ఏలూరుకు చెందిన షేక్ అబ్దుల్ ఖాజా దర్గాలోని ఏడు సమాధులకు స్టీలు రక్షణ కవచాలు ఏర్పాటు చేయించారు. అదేవిధంగా శుక్రవారం రొట్టెల పండగకు వచ్చే భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. దర్గా కమిటీ సెక్రటరీ షేక్.సందానిబాషా, కోశాధికారి షేక్ యస్దాని, సభ్యుడు షేక్ సాదిక్‌లతో కలిసి దాతల సహకారం తీసుకుని దర్గాలో పూర్తిస్థాయి వసతుల కల్పనకు కృషి చేస్తున్నాం.

– షేక్ అబ్దుల్ రషీద్, సాతో షహీద్ దర్గా చైర్మన్

విద్యార్థినికి సన్మానం



పొదలకూరు : జేఈఈలో ఉన్నత ర్యాంకు సాధించి ఐఐటీ కాన్పూర్‌లో సీటు సంపాదించిన విద్యార్థిని వెంకటస్నేహలతను స్థానిక వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో గురువారం సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థిని తల్లిదండ్రులు దేవస్థానం అభివృద్ధికి సహకరించారని, ప్రతిష్టాత్మక ఐఐటీలో సీటు సాధించడం హర్షించదగ్గ విషయంగా పేర్కొన్నారు. విద్యార్థులను ప్రోత్సహించేందుకు దేవస్థానం తరపున సన్మానించినట్లు తెలిపారు.

ఉపాధి పనుల పరిశీలన

పొదలకూరు : మండలంలోని కనుపర్తి పంచాయతీలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులను డ్వామా ఇన్‌చార్జి పీడీ బి.శ్రీనివాసులు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా మస్టర్లను తనిఖీ చేసి కూలీలతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. కూలీల సంఖ్యను పెంపొందించాల్సిందిగా ఆదేశించారు. పీడీ వెంట ఉపాధి సిబ్బంది ఉన్నారు.

కసుమూరులో భక్తుల కోలాహలం



కసుమూరు దర్గా వద్ద భక్తుల రద్దీ

వెంకటాచలం : కసుమూరులోని మస్తాన్‌వలీ దర్గా ప్రాంగణం గురువారం భక్తులతో కోలాహలంగా మారింది. నెల్లూరు బారాషహీద్ దర్గా వద్ద రొట్టెల పండగకు హాజరైన భక్తులు కసుమూరుకు చేరుకోవడంతో మస్తాన్‌వలీ దర్గా వద్ద సందడి మొదలైంది. వేలాది మంది భక్తుల రాకతో కసుమూరులో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ట్రాఫిక్ సమస్య, క్యూలైన్ల వద్ద తోపులాట జరగకుండా పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. తాగునీరు, పారిశుద్ధ్య సమస్య తలెత్తకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టకపోవడంతో భక్తులు ఇబ్బందులు పడ్డారు.

మట్టి స్వభావాన్ని తెలుసుకోవాలి

విడవలూరు : నేలలో పోషకాలు, వాటి ఉపయోగాలతో పాటు మట్టి స్వభావం గురించి విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని ఆత్మ పీడీ దొరసాని అన్నారు. మండలంలోని అలగానిపాడు గ్రామంలో ఉన్న జెడ్పీ పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులకు గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీడీఏ శివన్నారాయణ మాట్లాడుతూ నేలలోని నత్రజని, భాస్వరం, పొటాష్ వంటి సూక్ష్మధాతువుల గురించి తెలుసుకోవాలన్నారు. అనంతరం కృషి విజ్ఞాన కేంద్రం కో–ఆర్డినేటర్ పి.అనూష మట్టి నమూనాలను సేకరించే విధానం, ప్రయోగాలను విద్యార్థులకు తెలియజేశారు. కార్యక్రమంలో ఏడీఏ కె.కన్నయ్య, మండల ఏఓ పి.వెంకటకృష్ణయ్య, ఏఈఓ కిరణ్, వీపీఏలు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హెల్మెట్‌తో రక్షణ

కోవూరు : హెల్మెట్ వినియోగంపై కోవూరు కోర్టు సముదాయం నుంచి బజారు సెంటర్ వరకు న్యాయవాదులు గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తులు జె.కాత్యాయని, ఐ.కృష్ణయ్య, సలీమ్‌బాషా మాట్లాడుతూ ద్విచక్ర వాహనాలు నడిపే సమయంలో తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, వాటితో ప్రాణాలకు రక్షణ ఉంటుందని తెలిపారు.